నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, శ్రీశైలంలో గవర్నర్ పర్యటన నేపథ్యంలో శ్రీశైలం నుంచి పాల్గొంటున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి మహోత్సవాల విధుల నిర్వహణ అధికారులు మినహాయించి మిగిలిన జిల్లా అధికారులు హాజరు కావాలని ఆమె ఆదేశించారు.


రావణ వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

రావణ వాహనంపై ఆది దంపతులు

- స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయశాఖ మంత్రి ఆనం
- శ్రీశైలంలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


శంఖం పూరిస్తూ..


వేషధారణలో కళాకారులు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి రావణ వాహనంపై విహరించారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులను సుగంధపుష్పాలతో ముస్తాబు చేసిన రావణ వాహనంపై ఆశీనులజేసి ఆలయ అర్చకులు, వేదపండితులు అర్చనలు, హారతి పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయ రాజగోపురం నుంచి వెలుపలికి తీసుకువచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేశాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, భంజారా నృత్యం, శంఖానాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు కొనసాగింది. రావణ వాహనంపై దర్శనమిచ్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను భక్తులు కన్నులారా వీక్షించారు. గ్రామోత్సవంలో దేవస్థాన ఆలయ అధికారులు, సిబ్బంది, విశేషగా భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివదీక్షా శిబిరాల ప్రాంగణంలో నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం సంప్రదాయ నృత్యప్రదర్శన, భక్తి సంగీత విభావరి, భక్తి రంజనీ, భక కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణ

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆదివారం రాత్రి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీశైల ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అలాగే విజయవాడ దుర్గామలేశ్వరస్వామి దేవస్థానం తరఫున ఈవో, దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలతో వచ్చిన వీరికి శ్రీశైల దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సమర్పించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. క్షేత్రంలో మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర ఆజాద్ పాల్గొన్నారు.

నేడు పుష్ప పల్లకీ సేవ

మహాశివ రాత్రి బ్రహ్మోత్స వాలలో భాగంగా ఆరో రోజు సోమ వారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు పుష్పపల్లకీ సేవ నిర్వహించనున్నారు.


పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి ఆనం


కోలాట నృత్య ప్రదర్శన


ఆకట్టుకుంటున్న వేషధారణ


శివపార్వతుల వేషధారణ

ఆంధ్రజ్యోతి విజిట్

ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. రికార్డు ప్రకారం 105 మంది విద్యార్థులు భోజనం చేయాలి. ఆదివారం కేవలం 15 మంది విద్యార్థులే ఉన్నారు. వారికైనా మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించారా..? అంటే అదీలేదు. నీళ్ల చారు, ముద్దన్నంతో సరిపుచ్చారు. కేర్‌టేకర్, ట్యూటర్లు అందుబాటులో లేవు. పెద్దహరివాణంలో ఒక్కటే కాదు.. జిల్లాలో ముప్పాతిక శాతం సీజనల్ హాస్టళ్ల పరిస్థితి దాదాపు ఇలాగే ఉంది. కరువు కోరల్లో చిక్కుకొని.. బతుకుపోరులో రైతులు, కూలీలు ఊరుగాని ఊళ్లకు వలస వెళితే.. వారి పిల్లల చదువులు మధ్యలో ఆగిపోకూడదని, ఆ చిన్నారులకు ఆకలి తీర్చాలనే లక్ష్యంగా ప్రభుత్వం కాలానుగుణ వసతి కేంద్రాలు (సీజనల్ హాస్టళ్లు) ఏర్పాటు చేసింది. అయితే ఇవి కొందరు స్వార్థపరుల దోపిడీ కేంద్రాలుగా మారాయి. అమ్మనాన్నలు వలసలు వెళితే.. ఆకలికేకలతో అలమటించే చిన్నారులకు ఆకలి తీర్చే సీజనల్ హాస్టళ్ల నిర్వహణలో ఇంత నిర్లక్ష్యమా..? అంటూ పలువురు మండిపడుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' బృందాలు ఆయా సీజనల్ హాస్టళ్లను ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించగా దారుణమైన వాస్తవాలు వెలుగు చూశాయి. ఆ వివరాలు ఇలా..


తుగ్గలి మండలం జొన్నగిరిలో ఇలా కానిస్తున్నారు

సీజనల్ దోపిడీ

- జిల్లాలో విద్యార్థుల వలస నివారణకు 35 హాస్టళ్లు ఏర్పాటు
- ఒక్కో కేంద్రంలో 50 మందికి అవకాశం
- అధిక హాస్టళ్లల్లో అరకొర విద్యార్థులు
- బోగస్ హాజరు చూపి నిధులు నొక్కేస్తున్న సిబ్బంది
- ఆంధ్రజ్యోతి విజిట్‌లో విషయాలు బహిర్గతం

కల్లపరిలో 50 మంది విద్యార్థులకు వడ్డించేందుకు తయారు చేసిన అన్నం


కర్నూలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అంటే కరువు.. వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మంత్రాలయం, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 2.50 లక్షల కుటుంబాలు గుంటూరు, తెలంగాణ ప్రాంతాల్లో పత్తి తీత, మిరప కోత పనులకు వలసలు వెళ్లాయి. కన్నవాళ్లతో పాటు చదుకునే విద్యార్థులు కూడా వలస వెళ్తుండడంతో బడిలో హాజరు శాతం తగ్గుతోంది. బడిలో డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతోంది. అమ్మనాన్నలు వలస వెళ్లినా.. పేద విద్యార్థులకు రోజూ మూడు పూటల ఆకలి తీర్చి బడిలో హాజరు శాతం పెంచాలనే లక్ష్యంగా జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లఏర్పాటు చేశారు. ప్రతి హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించాలి. మధ్యాహ్న భోజనం పాఠశాలలో తింటే.. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం ఈ హాస్టళ్లలో వడ్డించాలి. ఆదివారం వంటి సెలవు రోజుల్లో మధ్యాహ్నం కూడా భోజనం వడ్డించాలి. అమ్మనాన్నలు వలస వెల్లడంతో ఆలనపాలన బాధ్యతలు ఈ వసతి కేంద్ర నిర్వాహకులే చూడాలి. అందుకుగానూ ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.1,000, కేర్ టేకర్, ట్యూటర్, ఇద్దరు వంట మనుషులు రూ.30 వేలు జీతం చొప్పున ఒక్కో సీజనల్ హాస్టల్‌కు రూ.80 వేలు నిధులు ఇస్తోంది. ఈ లెక్కన జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లకు నెలకు రూ.28 లక్షలు ఖర్చు చేస్తోంది. ఈ నిధులు సమగ్రశిక్ష అభియాన్ ద్వారా కేటాయిస్తున్నారు.


ఆదోని మండలం పెద్దహరివాణంలో సీజనల్ హాస్టల్-1,2లో 105 మందికి గాను హాజరైంది వీరే

అధ్వానం.. అరకొర భోజనం

అమ్మనాన్నలు వలస వెళ్లడంతో ఆకలికేకలతో అలమటిస్తున్న పేద విద్యార్థులకు అన్నం పెట్టి ఆకలి తీర్చే సీజనల్ హాస్టళ్లను నిబంధనలు ప్రకారం నిర్వహిస్తున్నారా..? మెనూ ప్రకారం భోజనాలు వడ్డిస్తున్నారా..? విద్యార్థుల సేవలో ఏమేరకు తరిస్తున్నాయి..? తెలుసుకునేందుకు ఆదివారం పలు సీజనల్ హాస్టళ్లను 'ఆంధ్రజ్యోతి' బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేస్తే అత్యంత దారుణమైన నిజాలు వెలుగు చూశాయి. మెజార్టీ హాస్టళ్లలో సగం కంటే తక్కువ విద్యార్థులే ఉన్నారు. వారికైనా రుచికరమైన భోజనం వడ్డించారా..? అంటే అదీలేదు. నీళ్ల చారు, ఉడికీ ఉడకని ముద్దన్నంతో సరిపుచ్చారు. కేర్ టేకర్, ట్యూటర్లు అందుబాటులో లేరు. 50 మంది విద్యార్థులకు రెండు మూడు కిలోల అన్నం వంట చేశారు. పలు హాస్టళ్లలో రికార్డులు లేవు. సోమవారం వరకు 90-95 శాతం వరకు హాజరైనట్లు హాజరు పట్టీలో చూపించారు. ఆదివారం హాజరే వేయలేదు. ఇదేమని అక్కడ ఉన్నవారిని ప్రశ్నిస్తే తమకేమీ తెలియదంటూ సమాధానం ఇచ్చారు. కాసుల కక్కుర్తితో పేద విద్యార్థుల కడుపు కొడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాల్సిన మండల విద్యా అధికారులు (ఎంఈవో) తనిఖీలు చేయడం లేదని తెలుస్తోంది.

కౌతాళం మండలం కాత్రికిలో తలుపులు తెరుచుకోని హాస్టల్


అధికారుల తనిఖీలోనూ ఇదే పరిస్థితి

సమగ్రశిక్ష అధికారుల తనిఖీలో కూడా పెద్దఎత్తున నిర్లక్ష్యం, అక్రమాలు వెలుగు చూశాయి. ఈ నెల 18న సమగ్రశిక్ష అభియాన అడిషనల్ ప్రాజెక్టుకో-ఆర్డినేటర్ (ఏపీసీ) టి.శ్రీనివాసులు మండల కేంద్రం కోసిగి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు సీజనల్ హాస్టళ్ల తనిఖీ చేస్తే ఆ సమయంలో తాళం వేశారు. ఆ తరువాత కేర్ టేకర్ వచ్చి తలుపులు తీసినా అక్కడ హాస్టల్ నిర్వహిస్తున్న ఆనవాళ్లు లేవు. రికార్డులు కూడా లేవు. పాఠశాల నైట్ వాచ్‌మనే కేర్ టేకర్‌గా పని చేస్తున్నారు. 19న పత్తికొండ మండలం పదికోన సీజనల్ హాస్టళ్లు తనిఖీ చేయగా.. ఒక చిన్న గదిలో నిర్వహిస్తున్నట్లు తెలిసింది. 50 మంది విద్యార్థులకు విద్యాభ్యాసం చేయడానికి ఏమాత్రం సరిపోవడం లేదు. అంతేకాదు.. ఒక హాస్టల్‌లో విద్యార్థులు హాజరు కాలేదు. మరో హాస్టల్‌లో 15-20 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అధికారుల తనిఖీలో వెలుగు చూసిన వాస్తవాలు ఇవి. అంటే.. సీజనల్ హాస్టళ్ల నిర్వాహకులు పేద విద్యార్థుల ఆకలి పేరిట ఏ స్థాయిలో దోపిడీ చేస్తున్నారో ఇట్టే తెలుస్తోంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ద్వారా సమగ్ర విచారణ చేయిస్తే సీజనల్ హాస్టళ్ల పేరిట జరుగుతున్న భారీ అక్రమాల భాగోతం వెలుగు చేసే అవకాశం లేకపోలేదు.

మిగతా 7వ పేజీలో

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్ష

- పేపరు-1కు 86.99 శాతం, పేపరు-2కు 86.84 శాతం మంది అభ్యర్థులు హాజరు
- పరిశీలించిన కలెక్టర్


సెయింట్ జోసెఫ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 30 కేంద్రాల్లో నిర్వహించిన ఏపీపీఎస్‌సీ గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆదివారం ఉదయం కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డు సెయింట్ జోసెఫ్ కాలేజీని కలెక్టర్ పరిశీలించారు. ఎ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్, ఇందిరాగాంధీ స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలోని కేంద్రాలను జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు గ్రూప్-2 పేపర్-1 పరీక్షలు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించినట్లు వెల్లడించారు. ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు 9993 మందికి 8693 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షకు 8678 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. పేపర్-1కు 86.99 శాతం, పేపర్-2కు 86.84 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని వెల్లడించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు.

తనిఖీ చేసిన ఎస్పీ

కర్నూలు క్రైం: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్‌సీ గ్రూప్-2 పరీక్షి కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం పరిశీలించారు. స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో క్లస్టర్ల వారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మాల్ ప్రాక్టీసు వంటి ఘటనలు జరగకుండా భద్రతా చర్యలను చేపట్టామన్నారు. అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా తనిఖీలు చేపట్టామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, నాగరాజరావు, పవన్ కుమార్ ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్నితనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

సమస్యలపై గళమెత్తాలి

- కరువు జిల్లాలో వెంటాడుతున్న సమస్యలు
- అసంపూర్తి ప్రాజెక్టులకు నిధులు రాబట్టాలి
- రహదారులు మరమ్మతులు సరే.. శాశ్వత పరిష్కారం చూపాలి
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- అమరావతికి బయలుదేరిన కూటమి ఎమ్మెల్యేలు



కర్నూలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలుదీరిన ఎన్డీఏ ప్రభుత్వం తొలిసారిగా సంపూర్ణ బడ్జెట్ ఈ నెల 28న ప్రవేశ పెట్టనుంది. నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అమరావతికి చేరుకున్నారు. ఈ సమావేశాలకు హాజరు అవుతామని వైసీపీ ప్రకటించడంతో ఆ పార్టీ మంత్రాలయం, ఆలూరు ఎమ్మెల్యేలు కూడా రాజధానికి చేరుకున్నారు. 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. జిల్లాకు చెందిన సమస్యలపై ఎమ్మెల్యేలు గళమెత్తి, నిధులు రాబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే క్రమంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సమన్వయం చేసుకొని జిల్లా ఇన్‌చార్జి మంత్రులు ద్వారా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ల దృష్టికి జిల్లా ప్రాధాన్యతా అంశాలను తీసుకువెళ్లి ఎక్కువ నిధులు రాబట్టాలి.

సాగునీటి ప్రాజెక్టులు పట్టాలెక్కించాలి

ఉమ్మడి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.950 కోట్లు నిధులు కావాలని ఇప్పటికే ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. వీటితో పాటు హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు మరో రూ.1,150 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. అవసరమైన మేరకు నిధులు రాబట్టాలి. కరువు.. వలసలు నివారణే లక్ష్యంగా చేపట్టిన వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులు సహా గుండ్రేవుల జలాశయం నిర్మాణాలు పట్టాలెక్కించేలా గళం వినిపించాలి.

వీటిపై గళం వినిపించాలి

- ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరంలో 9185 ఇళ్లు, ఆదోని పట్టణంలో 3,800, ఎమ్మిగనూరు పట్టణంలో 3,250, నంద్యాల 5,070 టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినా పేదలకు పంపిణీ చేయలేదు. మౌలిక వసతులు లేకపోవడమే ప్రధాన కారణం.
- కర్నూలు సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ భవనాలు, ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు రూ.930 కోట్లతో చేపట్టారు. వివిధ దశల్లో ఆపేశారు. ఈ పనులు మొదలు పెట్టి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.
- రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై రూసా నిధులు రూ.20 కోట్లు చేపట్టారు. పునాదులతో ఆగిపోయింది. ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల విస్తీర్ణం, ఫేజ్-1 కింద రూ.18 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయం పనులు ఆపేశారు.
- జగన్నాథగట్టుపై 52 ఎకరాల్లో రూ.80 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన 'క్లస్టర్ యూనివర్సిటీ' పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇటీవల రూ.20 కోట్లు ఇచ్చినా కాంట్రాక్టర్ బకాయికే సరిపోతాయి. ఈ కాంట్రాక్టర్ గత వైసీపీ ప్రభుత్వంలో ఓ మంత్రికి అత్యంత సన్నిహితుడు అంటున్నారు.
- జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటికి కుళాయి కనెక్షన్ కోసం రూ.1,545 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వీటిపై దృష్టి సారించాలి.
- రోడ్డు భవనాల శాఖ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ప్రధాన రోడ్లు మరమ్మతులో సరిపుచ్చారు. శాశ్వత ఆధునీకరణ పనులు చేపట్టేలా గళం విప్పాలి.
- ప్రతిపక్ష నేతగా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్ పార్కు, ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత పక్కా భవనాలు, కోడుమూరు పట్టణం తాగునీటి కోసం గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్‌లకు నిధులు రాబట్టాలి.



అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

'క్లాప్' ఆటోల జప్తు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో చెత్తను తరలిస్తున్న 45 క్లాప్ ఆటోలను బ్యాంకు అధికారులు జప్తు చేశారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం చెత్తను సేకరించేందుకు 95 క్లాప్ ఆటోలను కార్పొరేషన్‌ను అప్పగించింది. ఈ క్రమంలో ఆటోలకు సంబంధించి బాడుగలు, డ్రైవర్ల జీతాలను చెల్లించే విధంగా ఓ ఏజెన్సీకి ఇచ్చారు. చెత్త పన్ను వసూలు చేసి క్లాప్ ఆటోలకు సంబంధించి డబ్బులు చెల్లించేవారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రెండు రోజుల క్రితం చెత్త పన్ను రద్దు చేస్తూ గవర్నర్ ఆమోద ముద్ర కూడా పడింది. దీంతో ఆటోలకు సంబంధించి ఏజెన్సీ ప్రతినిధులు బ్యాంకులకు డబ్బులు చెల్లించకపోవడంతో 45 ఆటోలను జప్తు చేశారు. ప్రస్తుతం నగర పాలక సంబంధించిన ట్రాక్టర్లతోనే చెత్త సేకరణ జరుగుతోంది.

ఎస్సీ వర్గీకరణ సరికాదు

మాలల యుద్ధ గర్జన మహాసభలో నాయకులు



సభలో అభివాదం చేస్తున్న మాల సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సరికాదని మాల సంఘాల నాయకులు అన్నారు. కర్నూలు నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో రాయలసీమ మాలల యుద్ధ గర్జన మహాసభ మాలల జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు అధ్యక్షతన నిర్వహించారు. మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కుట్ర వల్ల ఎస్సీ వర్గీకరణ తీర్పు వచ్చిందని అన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ వర్గీకరణ వల్ల మాల కులస్థులకు నష్టం జరుగుతుందని అన్నారు. గ్రామ స్థాయిలో వర్గీకరణకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు.మాలల శక్తిగా తయారు కావాలని, అందరూ కలిసి పోరాటం చేస్తేనే ఉద్యమం ఉధృతం దాలుస్తుందన్నారు. సభలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ ప్రసాద్, విశ్రాంత అధికారి పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే సంతృప్తి

రూ.28 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన బీసీ రాజారెడ్డి



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బీసీ రాజారెడ్డి

మహానంది, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవతోనే సంతృప్తి కలుగుతుందని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. తన తల్లిదండ్రులు బీసీ లక్ష్మమ్మ, బీసీ గుర్రెడ్డి జ్ఞాపకార్థం సొంత నిధులు రూ.28లక్షలు వెచ్చించి నంద్యాల- అమరావతి జాతీయ ప్రధాన రహదారిలోని గాజులపల్లె సమీపంలో ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. నేషనల్ హైవే 544లో నల్లమల కొండ అంచున ప్రజలకు ఉచితంగా మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా భోజన వసతి కల్పించారు. రాజారెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులు, వాహనదారులు సర్వనరసింహస్వామి ఆలయానికివెళ్లే భక్తుల దాహం తీర్చడానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిద్దలూరు, కంభం, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు, ప్రయాణికులకు దాహార్తి తీర్చాలన్న ఆలోచనలతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అర ఎకరం కొనుగోలు చేసి విద్యుత్ సౌకర్యం లేకపోయినా సొంత నిధులతో విద్యుత్ సంతంభాలు ఏర్పాటు చేసి విద్యుత్‌లైన్‌లను లాగించామని చెప్పారు. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులు, వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో పాటు సమీపంలోని సర్వలక్ష్మీనరసింహస్వామి భక్తులకు కూడా తాగునీటి సమస్య తీరుతుందని చెప్పారు. 11 ఏళ్ల క్రితం బనగానపల్లె - కర్నూలు రహదారిలో బేతంచెర్ల మండలం గోర్లగుట్ట సమీపంలో ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి నేటికీ ప్రయాణికులు, వాహనదారుల దాహార్తిని తీరుస్తున్నట్లు తెలిపారు. అలాగే 10ఏళ్ల క్రితం బేతంచెర్ల మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ మద్దిలేటిస్వామి క్షేత్రంలో భక్తులకోసం మినరల్‌వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాజులపల్లె గ్రామ సమీపంలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన బీసీ రాజారెడ్డిని గ్రామస్థులు శాలువా కప్పి గజమాలలతో సత్కరించారు.

ఉచితంగా చికెన్ పకోడీ, ఉడకబెట్టిన గుడ్లు

- ఎమ్మిగనూరులో ఓ కంపెనీ ఆధ్వర్యంలో పంపిణీ



చికెన్ పకోడీ, ఉడకబెట్టి గుడ్లను పంపిణీ చేస్తున్న దుకాణ సిబ్బంది

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని గూడూరు రోడ్డులో ఉన్న ఓ చికెన్ సెంటర్ వద్ద వెన్‌కాబ్ కంపెనీ డీలర్ జహంగీర్ ఆదివారం మాంసం ప్రియులకు కంపెనీ ఆధ్వర్యంలో ఉచితంగా చికెన్ పకోడీ, ఉడకబెట్టిన గుడ్లను పంపిణీ చేశారు. కోళ్లకు వైరస్ సోకుతున్న నేపథ్యంలో వ్యాపారాలు జరగక యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రజలు కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ చికెన్ పకోడీ, గుడ్లను ఉచితంగా పంపిణీ చేయడం గమనార్హం. చికెన్ తింటే ప్రమాదమని తినడానికి ప్రజలు భయపడుతున్నారని, వారిలో అపోహ తొలగించడానికి ఉచితంగా పంపిణీ చేశామని డీలర్ చెప్పారు. వెన్‌కాబ్ కంపెనీ ఆధ్వర్యంలో 500 కేజీల చికెన్ పకోడీ, సుమారు 3వేల ఉడకబెట్టిన గుడ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రెండు గుడ్లు, 200 గ్రాముల చికెన్ పకోడీ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నరేంద్ర రెడ్డి ఉన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు: డీఐఈవో

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇంటర్ విద్యాధికారి సునీత చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లను హెచ్చరించారు. ఆదివారం నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సీఎస్, డీవోలకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ అన్ని పరీక్షా కేంద్రాలలో తప్పనిసరిగా తాగునీరు, గాలి, వెలుతురు, సరైన బెంచీలు ఉండేవిధంగా చూడాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, పరీక్ష జరిగే సమయంలో, అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కేంద్రాలను సీసీ కెమెరాలతో మానిటరింగ్ చేస్తామని, ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పరీక్షల స్పెషల్ ఆఫీసర్ శంకర్‌నాయక్, డీఈసీ సభ్యులు పీవీ రామన్, కృష్ణయ్య, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణం దగ్ధం



మంటల్లో కాలిపోతున్న మద్యం బాటిళ్లు

పాణ్యం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాణ్యంలోని శ్రీ ఆద్య మద్యం దుకాణం శనివారం అర్థరాత్రి దగ్ధమైంది. ఈ సంఘటనలో దాదాపు రూ. 40 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం అదనంగా వచ్చిన మద్యం సరుకు నిల్వ ఉంచడంతో భారీ నష్టం చోటు చేసుకున్నట్లు తెలిసింది. విద్యుదాఘాతమే ఈ ప్రమాదానికి కారణమని నిర్వాహకులు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే నంద్యాల అగ్నిమాపక, విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది అతి కష్టంమీద మంటలను ఆర్పివేశారు. సంఘటనా స్థలాన్ని నంద్యాల జిల్లా అగ్నిమాపక అధికారి యోగిశ్వరరెడ్డి, పాణ్యం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఆదివారం పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, అబ్దుల్ రఫి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో శివభక్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్నశివ భక్తులు

శ్రీశైలం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో ఆదివారం శివ స్వాములు ఆందోళనకు దిగారు. స్థానికంగా ఉండే సిద్ధరాప్ప వాణిజ్య సముదాయంలోని ఓ దుకాణదారుడు శివ స్వామిని కొట్టాడని అతనిడి షాపును స్వాములు ధ్వంసం చేశారు. అనంతరం నంది సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దుకాణదారుడిని అదుపులోకి తీసుకుని శివస్వాములకు సర్దిచెప్పారు. అయితే మాలధారణలో ఉన్న వ్యక్తి యాచకుడు అని పోలీసులు విచారణలో తేలింది.

సీజనల్ దోపిడీ

(5వ పేజీ తరువాయి)

పరిశీలనలో వెలుగు చూసిన వాస్తవాలు



కోసిగి: కందుకూరులో సీజనల్ హాస్టల్ నడిపే బడికి తాళం వేశారు.. 11.30 గంటల తర్వాత ఆంధ్రజ్యోతి ప్రతినిధి వెళ్లడంతో తలుపులు ఓపెన్ చేసిన దృశ్యం

ఆదోని రూరల్: కర్ణాటక సరిహద్దున ఉన్న మండలంలోని పెద్దహరివాణం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకే గదిలో రెండు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశారు. హాస్టల్-1లో 53, హాస్టల్-2లో 52 మంది కలిపి 105 మంది విద్యార్థులు ఉన్నట్లు హాజరు పట్టికలో చూపించారు. రెండు హాస్టళ్ల పరిధిలో ఆదివారం బాలికలు 11 మంది. బాలురు 4 కలిపి 15 మంది విద్యార్థులు ఉన్నారు. కేర్ టేకర్లు, ట్యూటర్లు, వంట మనుషులు అందుబాటులో లేరు. కేవలం మూడు నాలుగు కిలోలు అన్నం, నీళ్లచారు వంట చేశారు. చికెన్ లేదా గుడ్డు చేయాల్సి ఉంటే చేయలేదు. 12 గంటల తరువాత హెల్పర్ ఒకరు వచ్చారు. రోజే ఇదే పరిస్థితి అని స్థానికులు తెలిపారు.

కౌతాళం: మండలంలోని కాత్రికి గ్రామంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేశారు. 50 మంది విద్యార్థులకు గానూ ఏడుగురే ఉన్నారు. కేర్ టేకర్, ట్యూటర్, వంట మనుషులు లేవు. వాచ్‌మన్ ఒక్కరే ఉన్నారు. ఒకటి రెండు కిలోలు స్వీట్ పొంగల్ (బెల్లం అన్నం) చేశారు. రికార్డులు లేవు. రోజూ ఇదే పరిస్థితి అని ఆ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 'మా సారు కర్నూలు నుంచి అప్పుడప్పుడు వచ్చిపోతుంటారు' అని విద్యార్థులు తెలిపారు. కౌతాళంలోని సీజనల్ హాస్టళ్ల పరిస్థితి దాదాపు ఇదే.

కోసిగి: మండలంలోని కుందుకూరు గ్రామంలో ఓ ఇంట్లో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేశారు. 50 మంది విద్యార్థులకు గానూ ఒక్కరు కూడా హాజరు కాలేదు. కేర్ టేకర్, వంట మనిషి ఇద్దరు శ్రీశైలం వెళ్లడంతో రెండు మూడు రోజులుగా హాస్టల్ మూత పడిందని స్థానికులు తెలిపారు. తెరిచిన రోజుల్లో కూడా 15-20 మందికి విద్యార్థులకు మించి రావడం లేదని అంటున్నారు.

కోడుమూరు: మండలంలోని కల్లపరి గ్రామంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేశారు. స్థానిక స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఈ హాస్టల్ నిర్వహిస్తున్నారు. 12 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వండిన అన్నంను పరిశీలిస్తే రెండు కిలోలకు మించి ఉండదని తెలుస్తుంది. నీళ్ల చారుతో సరిపుచ్చారు.

- తుగ్గలి మండలం జొన్నగిరి, మండల కేంద్రం హొళగుంద, హాలహర్వి మండలం నెత్రవట్టి గ్రామాల్లోని సీజనల్ హాస్టళ్లలో తనిఖీ సమయంలో నిబంధనల మేరకు విద్యార్థులు హాజరైనా పలు కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనాలు వడ్డించలేదని తెలుస్తోంది.

ఎంఈవోలు తనిఖీ చేయాలి



సీజనల్ హాస్టళ్లను ఎంఈవోలు క్రమం తప్పక తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఇటీవల కోగిసి, పత్తికొండ మండలం పందికోన గ్రామంలోని నాలుగు సీజనల్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశాను. రెండు మూడు కేంద్రాల్లో విద్యార్థులే లేరు. ఓ కేంద్రంలో 15-20 మందే ఉన్నారు. రికార్డులు కూడా అందుబాటులో లేవు. కేర్ టేకర్లు, ట్యూటర్లు కూడా లేరని గుర్తించాం. ఆయా కేంద్రాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశాం. కలెక్టరుకు నివేదిక పంపించి ఆయన ఆదేశాల మేరకు శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

\- టి.శ్రీనివాసులు, ఏపీసీ, సమగ్రశిక్ష అభియాన్, కర్నూలు

కేసులు నమోదు చేస్తాం

జిల్లాలో 35 సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేశాం. అమ్మనాన్నలు వలస వెళ్లారనే బాధలేకుండా ఒక్కో హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు భోజనాలు వడ్డించడమే కాకుండా చదువు చెప్పిస్తున్నాం. వీటి నిర్వహణపై మండల విద్యా అధికారులు వారంలో రెండు హాస్టళ్లు ఆకస్మిక తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించాం. నిబంధనలు ప్రకారం నిర్వహణ లేకపోతే కలెక్టరుకు నివేదిక పంపి చర్యలు తీసుకుంటాం. అసరమైతే కేసులు నమోదు చేస్తాం.

\- పాల్, డీఈవో, కర్నూలు



కోడుమూరు మండలం కల్లపరి గ్రామంలో 50 మందికి గానూ హాజరైంది వీరే

చిన్నారిని చిదిమేసిన లారీ

- కన్నబిడ్డ మృతితో తండ్రి షాక్
- లారీతో పరారీ అయిన డ్రైవర్



ఆదిత్య నారాయణ (ఫైల్)

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు ప్రాక్టిస్ చేసేందుకు ఆ చిన్నారి ఉత్సాహంతో ఉదయమే లేచి స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధపడ్డాడు. నాన్న... నన్ను స్కూల్ వద్ద వదిలిపెట్టు....అనడంతో ఆ తండ్రి బైక్‌పై తన కుమారుడిని దిగబెట్టేందుకు బయలుదేరాడు. లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఆ చిన్నారిని చిదిమేసింది. కళ్ల ఎదుటే బిడ్డ లారీ చక్రాల కింద ఛిద్రమై ప్రాణాలు వదలడం చూసిన తండ్రి దిక్కులు పిక్కటిల్లేలా రోదించాడు. ఈ దారుణం ఆదోని పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్ సమీపంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పట్టణంలోని ఎల్బీస్టేట్‌కి చెందిన గురురాజా, ప్రతిభ దంపతులకు ఇద్దరు కుమారులు. ఆర్ట్స్ కళాశాల రహదారిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో మొదటి అబ్బాయి సత్యనారాయణ 9వ తరగతి, రెండో అబ్బాయి ఆదిత్య నారాయణ(10) ఐదో తరగతి చదువుతున్నారు. పాఠశాల వార్షికోత్సవం మంగళవారం జరగనుండడంతో సాంస్కృతిక కార్యక్రమాల కోసం విద్యార్థులు సిద్ధపడుతున్నారు. ఆదివారం పాఠశాలలో ప్రాక్టిస్ ఉండటంతో నాన్న..నన్ను పాఠశాల వద్దకు దించు అనడంతో ఆ తండ్రి తన బైక్‌పై ఎక్కించుకొని బయలుదేరారు. ఎమ్మిగనూరు సర్కిల్ సమీపంలోని కృష్ణ గుడి వద్దకు రాగానే అతి వేగంగా ఆర్ట్స్ కళాశాల రహదారి వైపు నుంచి లారీ దూసుకొచ్చింది. ఇరుకైనా రహదారి కావడం ఇరుపక్కల వాహనాలు ఉండడం బైకుపై తండ్రి, కొడుకులు ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీని చూసి ఒక్కసారిగా బ్రేకులు వేశారు. బైకు అదుపు తప్పడంతో తండ్రి ఎడమవైపు పడగా, కుమారుడు ఆదిత్య నారాయణ కుడివైపునకు ఒరిగి కిందపడ్డాడు. ఎదురుగా వేగంగా వచ్చిన లారీ విద్యార్థి ఆదిత్యనారాయణ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. చుట్టుపక్కల వాళ్లు కేకలు వేస్తూ పరుగులు తీశారు. అక్కడి నుంచి లారీతో పాటు డ్రైవర్ పరారయ్యాడు. తండ్రి షాక్ నుంచి తేరుకొని నాన్నా.. ఆదిత్య ఒక్కసారిలేగునాన్నా.. అంటూ గుండెలు బాదుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లి సంఘటన స్థలానికి చేరుకొని రక్తపుమడుగులో ఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి ఒక్కసారిగి కుప్పకూలిపోయింది. స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు అయిన వెంటనే వస్తానని చెప్పి ఇలా కనిపించకుండా కానరాని లోకాలకు వెళ్లావా అంటూ తల్లి రోదిస్తుండడంతో స్థానికుల అందరిని కంటితడి పెట్టించింది. వెంటనే 108 వాహనంలో మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించారు. లారీతో డ్రైవర్ పరారీ కావడంతో ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దళితవాడపై శీతకన్ను

- కాలువలు లేక రోడ్డుపైనే మురుగు • ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు
- పారిశుధ్య పనులు చేయడం లేదని గ్రామస్థుల ఆరోపణ

నంద్యాల పట్టణానికి కేవలం ఐదు కి.మీ.ల దూరంలోని బిల్లలాపురం గ్రామ దళితవాడను ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మురుగు కుంటలా తయారైందని, విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మురుగు కుంటలా మారిన ప్రధాన రహదారి

దారులన్నీ మురుగుమయం
కాలనీలో ఏ రహదారి చూసినా మురుగుతో దుర్వాసన వస్తోంది. ఎక్కడా కూడా కాలువలు నిర్మించలేదు. దీంతో అవస్థలు పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లలాపురం గ్రామం దళితవాడ అభివృద్ధికి దూరంగా ఉంది. దాదాపు 100 గృహాలు ఉండగా, 400మంది వరకు నివసిస్తున్నారు. తమ గ్రామాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

పారిశుధ్యపనులు లేవు..
ఇంత అపరిశుభ్ర వాతావరణం ఉన్నా తమ కాలనీలో పారిశుధ్య పనులు, ఫాగింగ్ కూడా చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మురుగులోనే వెళ్లాలి..
గ్రామంలోకి వెళ్లాలంటే దళితవాడ మీదే వెళ్లాలి. నిత్యం అధికారులు తిరుగుతున్నా స్పందించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


ఒరిగిన విద్యుత్ స్థంభం


రోడ్డుపైనే మురుగు..
గతంలో కాలువల నిర్మాణానికి తవ్వి పనులు చేయకుండా వదిలేశారు. దీంతో అవి కనుమరుగయ్యాయి. కాలువలు పూడిపోయి చెట్లు మొలిచి మురుగు ముందుకు పోవడం లేదు. కొత్తపల్లెకి వెళ్లే ప్రధాన రహదారి మురుగు గుంటలా ఉంది. విద్యుత్ స్థంభాలు కూడా ఒరిగిపోయాయి. **- పాములేటి, స్థానికుడు.**

26 నుంచి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని శైవ క్షేత్రాల్లో ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు.
ఓంకారంలో: ఈ నెల 26న ఆరుపండ్ల సైజు ఎద్దుల బలప్రదర్శన ఉంటుం దని, విజేతలకు వరుసగా రూ.50వేలు, 40వేలు, 30వేలు, 20వేలు, 10వేలు, 8వేలు ఇవ్వనున్నాట్లు ఈశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి తెలిపారు. 27న న్యూకేటగిరీ విభాగం పోటీలు ఉంటాయని, విజేతలకు రూ.60వేలు, రూ.45వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు ఇస్తామన్నారు. 28వ తేదీన సీనియర్స్ విభాగ పోటీల్లో విజేలకు రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.15వేలు బహుమతులు ఇస్తామని తెలిపారు.
కృష్ణనందిలో: ఈనెల 27, 28 తేదీలలో నిర్వహిస్తున్నట్లు శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజ శర్మ పర్యవేక్షణలో నిర్వహిస్తామని బాలుడు, చలమయ్య అన్నారు.
శివనందిలో: ఈ నెల 27వ తేదీన పాలదూళ్ళ విభాగపు ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు మదనభూపాల్, నాగేశ్వరావు, మల్లికార్జున తెలిపారు.

డాక్యుమెంట్ రైటర్ మృతి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన డాక్యుమెంట్ రైటర్ డమాం శంకర్ (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త తెలిపిన మేరకు.. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంలో వెల్తుండగాగా మెయిన్‌రోడ్డుపైకి రాగానే శ్రీనివాససెంటర్ నుంచి నూనెపల్లె వైపు వెళ్తున్న వాహనదారుడు శంకర్ వాహనాన్ని ఢీ కొట్టడంతో శంకర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం కర్నూలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక శనివారం మృతిచెందారు. శంకర్‌కు భార్య లక్ష్మి, కుమారుడు యశ్విత్, కూతురు తన్మయి ఉన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని నంద్యాలకు తరలించారు. మృతుడి మామ విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.


డమాం శంకర్ (ఫైల్)

సంతాపం వ్యక్తం చేసిన డాక్యుమెంట్ రైటర్లు
నంద్యాల డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫరూక్, కార్యదర్శి రమేష్ ప్రతినిధులు మహేశ్వరరావు, సహచరులు సంతాపం తెలిపారు. దుకాణాలను మూసివేశారు.

పాఠశాల తనిఖీ


విద్యార్థులతో ఆటల్లో పాల్గొన్న ప్రేమంత్‌కుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందమూరినగర్‌లో స్టార్ సొసైటీ నిర్వహిస్తున్న బుడగజంగాల ఆవాసీయ పాఠశాలను సమగ్ర శిక్ష స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రేమంత్‌కుమార్ ఆదివారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, వసతి, స్టోర్ రూం, సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆడపిల్లలకు, మగపిల్లలకు వేర్వేరుగా వసతులు, టాయిలెట్స్ ఏర్పాటుచేయడంతో నిర్వాహకులను అభినందించారు. ఆహారం, వైద్యం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లస్థలాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 24న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు రమేష్‌బాబు, ప్రతాప్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు నుగుణంగా గృహనిర్మాణ పథకం కింద రూ.5లక్షల సాయం ఇవ్వాలన్నారు

తిమ్మాపురం వాసికి డాక్టరేట్

మహానంది, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన గద్వాల సుధా మనోహర్‌కు అమెరికాకు చెందిన కాలిఫోర్నియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వ్యాపార నాయకత్వం కృత్రిమ మేథస్సు, యంత్ర అభ్యాసం, డిజిటల్ ప్రవర్తన పై పరిశోధనకు డిల్లీలో డాక్టరేట్ ప్రధానం చేసినట్లు సుధాకర్ తెలిపారు.


డాక్టరేట్ అందుకుంటున్న సుధా మనోహర్

సంగమేశ్వరంలో చలువ పందిళ్ల ఏర్పాటు


చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కొత్తపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా సంగమేశ్వరం ఎగువ ఉమామహేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ, పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది శ్రీశైలం వెనుకతట్టు జలాల్లో మునిగిన పాత ఆలయం ఈ ఏడాది శివరాత్రికి బయల్పడడం లేదు. దీంతో సంగమేశ్వరం దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎగువ ఉమామహేశ్వరున్ని దర్శించుకునేందుకు చలువ పందిళ్లు తాత్కాలిక దుస్తుల మార్పిడి గదులు, ప్రత్యేక క్యూలైన్లు తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లిన ఎంపీ శబరి


పాదయాత్ర చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

ఆత్మకూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పాదయాత్రగా బయలుదేరారు. ఆదివారం ఉదయాన్నే వెంకటాపురం గ్రామానికి చేరుకున్న ఆమె ముందుగా గ్రామంలోని మల్లేశ్వ రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. విలేకరులతో మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలకు ఏటా తాను పాద యాత్ర చేస్తానన్నారు. భక్తులపై అటవీ అధికారులు విధిస్తున్న ఆంక్షలపై ఆమె స్పందిస్తూ త్వరలోనే అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. మధ్యాహ్నం పెచ్చెర్వు చేరుకుని రెడ్‌క్రాస్ సొసైటీ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు, శ్రీశైలం కన్వీనర్ మోమిన్ షబాన, నాయకులు కురువ రమేష్ ఉన్నారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎస్సై నారాయణరెడ్డి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పాదయాత్రికులకు అల్పాహారం

పాములపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలానికి వెళ్లే పాదయాత్రికులకు గ్రామ శివార్లలోని జయలక్ష్మి మిని రైస్‌మిల్ అధినేత జనార్ధన్‌గుప్తా, జయలక్ష్మి దంపతులు అల్పాహారం అందించారు. ఐదు సంవత్సారాలుగా అన్నదానం చేస్తున్నామని తెలిపారు.


అన్నదానం చేస్తున్న జనార్ధన్‌గుప్తా దంపతులు

లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి


మాట్లాడుతున్న రవీందర్ ప్రసాద్

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్ కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని తహసీల్దార్ రవీందర్ ప్రసాద్ కోరారు. నంద్యాలలో ఆదివారం ఏపీ వీరశైవ లింగాయత్ ఓబీసీ సాధన సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలో వీరశైవలింగాయత్‌లు బీసీడీ కింద ఉన్నారని, కానీ ఓబీసీలో లేరన్నారు. ఓబీసీలో చేర్చితే విద్యార్థులకు రిజర్వేషన్లు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వీరభద్రప్ప, మంజు నాథ్, సురేష్, విజయ్, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు

బీజేపీలోకి వైసీపీ నాయకులు

గోస్పాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన వైసీపీ నాయకులు బీజేపీలో చేరారు. ఆదివారం యాళ్లూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ బెక్కెం నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు ఎంపీటీసీ మెంబర్లు 7 మంది వార్డు మెంబర్లు 100 మంది కార్యకర్తలు పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మధు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే దేశం అభివృద్ధిలో దూసుకెలుతోందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మధు గోపాల్, కో ఆప్షన్ మెంబర్ జట్టి గోకారి, మగ్బుల్ బాషా, రామచంద్రారెడ్డి, రామేశ్వర రెడ్డి, మరో వందమంది వైసీపిలో చేరారు.


బీజేపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో సీతారాముల ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం నిర్వహించారు. పళ్ల పడిగెలయ్య వంశస్థుల సహకారంతో గ్రామ పెద్దలు, పురోహితులు లక్ష్మినరసయ్య శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ చేసి, అన్నదానం నిర్వహించారు.

మహానందికి బ్రహ్మానందీశ్వరుడు


ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహనందీశ్వరుని పెళ్లి పెద్దగా ఆదివారం పల్లకీలో బ్రహ్మానందీశ్వరుడు మహానందికి వెళ్ళాడు. మహానందిలోలో పెళ్లి పెద్దగా నంద్యాల బ్రహ్మానందీశ్వరుడు వెళ్ళి కల్యాణం చేసి, తిరిగి తీసుకురావడం ఆనవాయితీగా వస్తుంది.

కారు అదుపు తప్పి నలుగురికి గాయాలు

గడివేముల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఆదివారం కారు అదుపు తప్పి నలుగురు గాయపడ్డారు. వివరాల మేరకు.. గని గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రామ కృష్ణ, రమణ, మంచాలకట్టకు చెందిన చారి నంద్యాల నుంచి గనికి వస్తుండగా గడిగరేవుల వద్ద కారు అదుపు తప్పి పొలంలోకి దూసు కెళ్లింది. దీంతో చారి, వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడగా రామకృష్ణ, రమణలకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


పొలంలోకి దూసుకెళ్లిన కారు

మోడల్ స్కూల్ విద్యార్థులకు అవార్డు


బెంగళూరులో అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

మహానంది, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.తిమ్మాపురం మోడల్ స్కూల్ విద్యార్థులు అవార్డు అందుకున్నారు. ఈ నెల 22న బెంగుళూరులో విప్రో లిమిటెడ్ సీఈవో అనురాగ్ బెహర్ చేతుల మీదుగా అందుకొన్నారు. విద్యార్థులు గీతావాణి, సుజాత, అఖిల ఆకాంక్ష, జయంత్‌కుమార్‌కు అవార్డుతో పాటు రూ.50 వేల నగదు బహుమతి అందచేశారు.

కొనసాగుతున్న తిక్కస్వామి ఉరుసు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబానగర్ హజరత్ సయ్యద్‌షా షెహిన్‌షా (తిక్కస్వామి) ఉరుసు ఆదివారం కొనసాగింది. భక్తులు పూలమాలలు, చాదర్ కొబ్బరికాయ కర్పూరం, ఊదిబత్తీలు వెలిగించి చక్కెర, బెల్లం, నగదు రూపంలో దర్గావద్ద మెక్కుబడులను సమర్పించుకొన్నారు.


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

26 నుంచి పాణికేశ్వర ఉత్సవాలు

పాణ్యం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా పాణ్యం పాణికేశ్వరస్వామి ఉత్సవాలు ఈనెల 26 నుంచి 28 వతేదీ వరకు జరుగుతాయని దేవాదాయ శాఖ ఈవో సువర్ణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 26న లింగోద్భవ కాలమందు స్వామివారి కళ్యాణం, రుద్రాభిషేకం, 27న అభిషేకాలు, 28న అన్నదాన, చెక్కభజన, స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు బ్యాంకర్ల సమావేశం

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టౌన్ హాల్‌లో సోమవారం బ్యాంకర్ల సమాశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. వార్డులు, బ్యాంకుల వారిగా జరిగే ఈ సమావేశంలో వెనుకబడిన తరగతులు ఆర్థికంగా వెనకబడిన అగ్రకులాల వారు పాల్గొంటారు. 2024-25 సంవత్సరానికి లక్ష్యాల మేరకు లబ్ధిదారులను బ్యాంకర్లు ఎంపిక చేస్తారు.

రైతుల ఖాతాలో నగదు జమ

వెలుగోడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పిఎం కిసాన్ నగదు రైతు ఖాతాల్లో ఈ నెల 24న జమ అవుతుందని ఏవో పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ మండలంలోని 5,770 మంది రైతులకునిధులు మంజూరయ్యాయన్నారు. భూమి ఉన్న రైతులు రిజిస్ట్రేషన్ చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల సబ్సిడీలు పొందాలని తెలిపారు.

ఒకే రోజు మూడు చోరీలు

మహానంది, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో ఒకే రోజు మూడు చోట్ల చోరీలు చోటుచేసుకున్నాయి. గాజులపల్లి రైల్వే స్టేషన్ గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఉన్న రెండు దుకాణాల్లో దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన శ్రీనివా సులు దుకాణంలో ఉన్న రూ.17 వేల నగదుతో పాటు రూ.లక్ష విలువ చేసే సరుకులను దోచుకెళ్ళారు. ప్రక్కనే ఉన్న మరో షాపులో రూ.10వేల నగదును దొంగలించుకొని వెళ్ళారు. దుకాణదారులు ఆదివారం మహానంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే నందిపల్లి గ్రామంలోని మదార్ స్వామి దర్గాలో హుండీలోని దాదాపు రూ.లక్షను అర్ధరాత్రి దొంగలించుకొని వెళ్ళినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు దర్గాను పోలీసులు పరిశీలించారు.


నందిపల్లిలో దర్గాను పరిశీలిస్తున్న పోలీసులు

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

- వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు : ట్రాఫిక్ సీఐ


మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని నంద్యాల ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జునగుప్త హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే మైనర్లను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఇటీవల మైనర్లు వాహనాలు నడపడం అధికమైందని వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 34మంది మైనర్లకు రూ.51వేల జరిమానా విధించామన్నారు. యువకులు అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన గుర్తు చేశారు.


ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ


విద్యుత్ కాంతులతో ముఖద్వారం

మహానందిలో బ్రహ్మోత్సవ శోభ

మహానంది, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రధాన గోపురాలతో పాటు రాజగోపురం, సుపతి మంటపాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ఆకట్టుకొంటున్నాయి. గతంలో లేని విధంగా ఈ ఏడాది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పరిసరాల్లో బ్రహ్మోత్సవ శోభ కనిపించేందుకు గాను ప్రత్యేకగా అలంకరణలు ఏర్పాటు చేయాలని టెండర్ పొందిన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో రెండు రోజుల క్రితమే విద్యుత్ అలంకరణ పనులు పూర్తి చేశారు. శనివారం ఆలయ ప్రధాన గోపురాలతో పాటు మంటపాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలో ఆలయ గోపురాలు మెరిశాయి.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పెద్దపూదిళ్లలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

ప్యాపిలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పెద్దపూదిళ్ల గ్రామంలో 26న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.20,016 అందజేయనున్నారు. ఆ తర్వాత వరుసగా రూ.15,016, రూ.8,016, రూ.5,016 నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'ఉచిత విద్యుత్ వాడడం లేదు'

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగటూరు గ్రామంలో ప్రైవేటు మినరల్ వాటర్ ప్లాంటుకు ఉచితంగా విద్యుత్ వాడడం లేదని టీడీపీ నాయకుడు ధనుంజయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల సభలో వెలగటూరు వైసీపీ సర్పంచ్ ఎల్‌వీ సుధాకర్‌రెడ్డి తనపై చేసిన ఆరోపణలు అవాస్తమన్నారు. తాను ఉచిత విద్యుత్ వాటినట్లు నిరూపిస్తే దేనికైనా రెడీ అని అన్నారు. నిరూపించలేకుంటే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తావా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

వారబందీ ద్వారా టీజీపీ నీరు విడుదల

చాగలమర్రి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వారబందీ ద్వారా టీజీపీ ప్రధాన కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు టీజీపీ డీఈ వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వీబీఆర్ నుంచి టీజీపీ కాలువకు 2 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలోని అహోబిలం, చాగలమర్రి, ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని కాలువలకు నీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దిగువ ఉన్న రైతులకు చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు నీరు విడుదల చేశామని అన్నారు. టీజీపీ ప్రధాన కాలువ మరమ్మతులకు రూ.30 కోట్లతో ప్రతిపాదనలు చేశామని అన్నారు. నిధులు మంజూరైతే పనులు చేపడతామని అన్నారు. టీజీపీ రిజర్వాయర్‌లో 6 టీఎంసీల నీరు నిల్వ ఉందని అన్నారు. కడప జిల్లాకు 25 టీఎంసీల నీటిని తరలించామని అన్నారు.

టమోటా రైతులను ఆదుకోవాలి

డోన్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): టమోటా, మిర్చి రైతులను తక్షణమే ప్రభుత్వ ఆదుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయ కర్త గార్లపాటి మద్దిలేటి డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మిర్చి, టమోటా రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. మిర్చి పంటకు కనీసం మద్దతు ధర రూ.26 వేలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. టమోటా రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. మార్కెట్‌లో కిలో 2 నుంచి రూ.3లు మాత్రమే ఘోరంగా పడిపోవడంతో టమోటా రైతులు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారన్నారు. సమావేశంలో నాయకులు మల్లంపల్లె జనార్దన్, జీవన్‌బాబు, మహేంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.



ముస్తాబవుతున్న కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం



ఏర్పాట్లు చేస్తున్న పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం



కొత్తబుగ్గలో రామలింగేశ్వరస్వామి ఆలయం పరిసరాల్లో వెలసిన రంగుల రాట్నాలు

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

చాగలమర్రి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహాశివరాత్రికి శివాలయాలు సిద్ధమయ్యాయి. ఆలయాలను విద్యుదీపాలతో అలకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూలైనట్లు, ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. చాగలమర్రి మండలంలోని బుగ్గమల్లేశ్వర, రామలింగేశ్వర, భీమలింగేశ్వర, మలయచల, భైరవీశ్వర ఆలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. ఆలయాలను చలువ పందిర్లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుగ్గమల్లేశ్వర, రామలింగేశ్వర ఆలయాల్లో 26న మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతాయని ఆలయ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు మేడా బాబు తెలిపారు. 26న తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సవం, 27న మహిళలచే విష్ణు సహస్రనామం, సీఎం అవార్డు గ్రహిత ముద్రడ్యాన్స్ నృత్య అకాడమి వారిచే భరత నాట్యం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని అన్నారు. రామలింగేశ్వర ఆలయంలో 27న పార్వతి పరమేశ్వరుల కల్యాణం ఉభయదారులచే నిర్వహిస్తున్నట్లు ఆయల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఈవో సాయి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుగ్గమల్లేశ్వర ఆలయంలో జాగరణ సందర్భంగా భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

26 నుంచి ఉత్సవాలు ప్రారంభం

డోన్ రూరల్: డోన్ పట్టణ సమీపంలో ఉన్న కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, పాత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాభు అవుతున్నాయి. కోట్లవారి పల్లె గ్రామ పరిధిలో వచ్చే కొత్తబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో ఇప్పటికే అంగళ్లు, భక్తులకు వినోదాన్నిచ్చే రంగుల రాట్నాలు, చిన్నారులను అలరించే పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. 26న కొత్తబుగ్గ, పాత బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి శివునికి అభిషేకాలు, విశేష పూజలు, మహా మంగళహారుతులు వంటి పూజలు నిర్వహించనున్నారు. జాగరణ సందర్భంగా హరికథ, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. 27న గురువారం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం జరగనుంది. 28న శుక్రవారం స్వామివారి రథోత్సవ కార్యక్రమం ఘనంగా జరగనుంది. మూడు రోజులుగా జరిగే ఈ ఉత్సవాలకు ధర్మకర్తలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

● అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం




మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. ఆలయానికి పెద్ద ఎత్తున వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని నీటి వసతి, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– రాజు, ధర్మకర్త, పాత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం, డోన్



చిన్నవంగలి సమీపంలో వెలసిన గృహ మద్దిలేటిస్వామి



చాగలమర్రిలో ముస్తాబైన బుగ్గమల్లేశ్వర ఆలయం



పూజలందుకున్న భైరవేశ్వర స్వామి

విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పాలి: బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణా విలువలు నేర్పాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని నెహ్రూ సీబీఎస్ ఈ హైస్కూల్ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా బీసీ ఇందిరమ్మ, విశిష్ట అతిథిగా కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కెవిసుబ్బారెడ్డి, బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పరివర్తనపై చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. పిల్లలను జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలన్నారు. ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని నాబనగానపల్లె, నా ఆరోగ్యం కార్యక్రమం మంచి ఫలితాన్ని ఇచ్చిందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ నేర్చుకుంటే భవిష్యత్‌లో భావిభారత పౌరులుగా ఎదిగి వారి బంగారు బాటలు వేసుకున్న వారవుతారన్నారు. కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యజమాని కెవిసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలన్నారు. నెహ్రూ కరస్పాండెంట్ కోడూరు హరినాథరెడ్డి మాట్లాడుతూ పిల్లకు చదువుతో పాటు , ఎన్‌సీసీ క్రీడలు, కరాటే సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించేలా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, కరాటే విన్యాసాలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోడూరు కమల్‌తేజారెడ్డి, మేనేజింగ్ డైరక్టర్ రవితేజారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

ఒకరోజు ముందే క్షేత్రానికి పార్వేట ఉత్సవమూర్తులు

● ఫారెస్ట్ అధికారులతో చర్చించిన మణియార్

● మార్చి4 నుంచి అహోబిళం బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రుద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పార్వేట ఉత్సవమూర్తులు ఒక రోజు ముందే అహోబిళ క్షేత్రానికి చేరుకోనున్నట్లు అహోబిళ క్షేత్రం పరిపాలన విభాగం నిర్వాహకుడు (మణియార్) సౌమ్యనారాయణ్ తెలిపారు. ఆదివారం రుద్రవరంలోని ఫారెస్టు కార్యాలయంలో ఫారెస్టు అధికారులతో పార్వేట ఉత్సవపల్లకీ చేరికపై చర్చించారు. ఈ ఏడాది రుద్రవరం, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ మండలాల్లో 44 రోజులు 33 గ్రామాల్లో పార్వేట ఉత్సవం కొనసాగుతున్నట్లు తెలిపారు. మార్చి 4నుంచి అహోబిళ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని వివరించారు. 28 ఉదయం అహోబిళం, పార్వేట పల్లకీ చేరుకోవాల్సి ఉందన్నారు. కానీ ఒక రోజు ముందే 27న ఉదయం అహోబిళ క్షేత్రానికి పార్వేట పల్లకీ చేరుకునేలా మార్పు చేసినట్లు వివరించారు. పార్వేట ఉత్సవ మూర్తుల పల్లకీని పంపించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న అహోబిళ క్షేత్రం మణియార్ సౌమ్యనారాయణన్

26 నుంచి ఆరాధనోత్సవాలు

డోన్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని శ్రీ సాయి రామచంద్ర మాలిక్ బాబా ఆలయంలో 26 నుంచి స్వామివారి 35వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు రామచంద్రమాలిక్ బాబా సేవా సంఘం అధ్యక్షులు ఆలా రామకృష్ణ తెలిపారు. 26 నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ వరకు ఈ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అహోబిలంలో నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటు



ఎగువ అహోబిలంలో స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఎగువ అహోబిలంలో నూతన విద్యుత్‌లైన్‌ను ఆ శాఖ అధికారులు ఆదివారం ఏర్పాటు చేశారు. అహోబిలం లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని 14(9.1 పోల్స్) విద్యుత్ స్తంభాలతో లైన్‌ను ఏర్పాటు చేశారు. దేవస్థానం బోయిలు అతికష్టంమీద విద్యుత్ స్తంభాలను కొండపైకి మోసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికాంత్ చౌదరి, ఏఈ వెంకట కృష్ణ, శేషు నాయక్, వీరచంద్ర, రాము, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

డోన్ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య కోరారు. ఆదివారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ పేదలకు పేరంటాలమ్మ గుడి వద్ద పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలను అడ్డుకుంటే పేదల పక్షాన పోరాడుతామన్నారు. రుద్రాక్షగుట్ట లబ్దిదారులకు పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నారాయణ, పట్టణ కార్యదర్శి మోట రాముడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన వారితో రాష్ట్ర రిటైర్డ్ ఎన్జీవో సంఘం ఉపాధ్యక్షుడు గువ్వల రామక్రిష్ణారెడ్డి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఆదివారం జిల్లా అధ్యక్షులు గోవిందు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ ఆఫీసులో పనిచేసే ఎస్ఎండీ హుసేన్ ఉపాధ్యక్షుడిగా ఇ.వెంకటేశ్వర్లు, ఎస్‌షబాషా, కార్యదర్శిగా మద్దిలేటి సంయుక్త కార్యదర్శులు ఎస్.ప్రభాకర్, పెద్దఓబులేసు, కోశాధికారిగా జె.ఖాజాహుసేన్, ఈసీ మెంబరుగా సుధర్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి దుర్గాకుమార్ తెలిపారు.

నిలిచిన నీటి ప్రవాహం



రుద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీటి సరఫరా నిలిపివేశారు. ఈ నెల చివరిలో తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. అయితే అధికారులు ఉన్నటుండి కాల్వకు సాగునీరు నిలిపివేస్తే పంటలు ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చి చివరి వరకు నీటిని విడుదల చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాల సెక్రటరీకి డాక్టరేట్



జీ శ్రీకాంత్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పట్టణంలోని కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల సెక్రటరీ జీ శ్రీకాంత్‌రెడ్డి డాక్టరేట్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి రాజస్థాన్‌లోని అల్వార్ సన్‌రైజ్ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగం అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మనీష్ సింగ్ పర్యవేక్షణలో ఫ్లూయిడ్ డైనమిక్స్‌లో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ డిగ్రీ అందుకున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలుగా కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూనే పరిశోధనలపై ఉన్న మక్కువతో నిరంతరం శ్రమించి డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. డాక్టరేట్ సాధించిన కళాశాల సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

శెట్టివీడు వాసికి...



పి.రామకృష్ణారెడ్డి

చాగలమర్రి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామానికి చెందిన పి.రామకృష్ణారెడ్డి తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయం ద్వారా డాక్టరేట్‌ను ఆదివారం ప్రధానం చేసింది. అనంతపురంలోని సెంట్రల్ యూనివర్శిటి ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పొలిటికల్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. మురళీధర్ పర్యవేక్షణలో సౌత్‌చైన సిక్రైసిస్-డిట్రైయాంగిలర్ పవర్ స్ట్రబుల్ అనే అంశంపై పరిశోధన పీసీస్ వ్రాశారు. జాతీయ, అంతర్జాతీయ సేమినార్‌లకు హాజరై పరిశోధన పత్రాలను సమర్పించారు. ఇందులో భాగంగా తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. రామకృష్ణారెడ్డి చాగలమర్రిలోని ఆర్సీఎం ఉన్నత పాఠశాల, వాసవీ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన రామకృష్ణారెడ్డిని పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థులు ఎంపిక

రుద్రవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నకంబలూరు ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 8వతరగతి విద్యార్థిని తేజస్విని, విద్యార్థి ప్రవీణ్ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఆదివారం ఉపాధ్యాయులు తెలిపారు. ఇద్దరు ఒకేసారి నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ ఎలిజబీలిటి టెస్ట్‌కు అర్హత సాధించిన సీఆర్పీ



కొండయ్య

చాగలమర్రి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న కొండయ్య జాతీయ ఎలిజబీలిటి టెస్ట్‌కు అర్హత సాధించారు. అంధుడైన కొండయ్య ఎంతో కష్టపడి టెస్ట్‌కు అర్హత సాధించడం పట్ల ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్లతో పాటు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

అవుకు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అవుకు మండలం శింగనపల్లె గ్రామ పరిధిలోని పేకాట స్థావరంపై దాడి చేసి అవుకు, శింగనపల్లె, చెన్నంపల్లె గ్రామాలకు చెందిన 7 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ పేకాట స్థావరం వద్ద రూ. 1.70 లక్షలు నగదు, 7 సెల్‌ఫోన్‌లు, 4 మోటర్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అవుకు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. ఆదివారం స్కూల్ మెయిన్ గేట్ వద్ద రూ. 1,10,000 ఖర్చు చేసి రేకుల షెడ్డును నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు విశ్రాంత ఉపాధ్యాయులు మేడం పార్వతీశం, సుబ్బరాయుడు పాఠశాల వద్దకు చేరుకొని రేకుల షెడ్డును ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు బాలరాజు, శ్రీనివాసులు, హరిశేవియానాయక్, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జయభారత్‌రెడ్డి, జకిరియ, చంద్రమౌళి, రామ్‌మోహన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

డోన్ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట్రికే హరికిషన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాలలో ఆర్యవైశ్యుల సంఘం కమిటిని ఎలక్షన్ కమిటి చీఫ్ మెంబరు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజు అధ్యక్ష కార్యదర్శులతో పాటు కమిటి సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంగం అధ్యక్షుడు కోట్రికే హరికిషణ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు అన్ని విదాలా అభివృద్ధి చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తానన్నారు. ముందుగా అధ్యక్షుడిగా కోట్రికే హరికిషన్, కార్యదర్శిగా రంగయ్య, ట్రెజరరీగా రజని, యువజన సంఘం అధ్యక్షులుగా కామిశెట్టి విద్యాసాగర్, సెక్రటరీ రాజాప్రదీప్, ట్రెజరర్ సముద్రాల విజయకుమార్‌లు ప్రమాణ స్వీకారం చేశారు.